ప్రజాశక్తి
సోమవారం 23 జనవరి 2023
5
అల్లూరి సీతారామరాజు

రేషన్ సమస్యపై వినతి

ప్రజాశక్తి-దుంబ్రిగూడ: జీసీసీ రేషన్ డిపోల్లో కందిపప్పు, పంచదార అరువు పద్ధతిలో ఇవ్వాలని, ఎంఎల్ఎస్ పాయింట్లకు సరఫరా వాహనాలు సమకూర్చాలని అరకులోయలో పర్యటించిన సివిల్ సప్లై కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్‌కు రాష్ట్ర గిరిజన రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వైకుంఠం, రాష్ట్ర కోశాధికారి బి.విక్రమ్ దేవ్ .జిల్లా కోశాధికారి రవి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న డీలర్ల సంఘం నేతలు

1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

▸▸ అక్రమ నిర్మాణాలపై ఎల్‌టిఆర్ కేసులు నమోదు చేయాలి ▸▸ అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యాన భారీ ర్యాలీ, మానవహారం

మీడియాతో మాట్లాడుతున్న అఖిలపక్ష పార్టీల నేతలు

ప్రజాశక్తి - హుకుంపేట: 1/70 చట్టంను పటిష్టంగా అమలు జరిగేవరకు ఉద్యమం ఆగదని అఖిలపక్షం నేతలు డిమాండ్ చేశారు. మండల కేంద్రం లోని గిరిజన సంఘం కార్యాలయంలో అఖిల పక్షం నాయకులు, వైస్ ఎంపీపీ కొండల అధ్యక్షతన ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నేతలు మాట్లాడుతూ, గిరిజనేతరుల అక్రమ నిర్మాణదారులపై ఎల్‌టిఆర్ కేసులు నమోదు చేయాలని, వీటిని కూల్చి వేయాలని డిమాండ్ చేశారు. ఆ కూల్చి వేసిన స్థలాలను గిరిజన పేదలకు, నిరుద్యోగ యువకులకు పంచి పెట్టాలన్నారు. భినామిల పేరుతో ఉన్న నిర్మాణాలు స్వాధీన పరచుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై చర్చించి వీటినీ అమలు పరచడానికి అఖిల పక్షం కమిటీ ఏర్పాటు చేశామన్నారు. గిరిజన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లేక స్వయం ఉపాధి కోసం షాపులు కట్టుకోవడానికి స్థలలు కేటాయించాలని పలుమార్లు రెవిన్యూ కార్యాలయంలో వినతిపత్రాలు ఇచ్చినా స్పందించక పోవడం దారుణమన్నారు. ముందుగా గిరిజన సంఘం కార్యాలయం నుండి ప్రధాన నాలుగు రోడ్ల కూడలి వరకు భారీ ర్యాలీ చేశారు. నాలుగు రోడ్ల కూడలిలో మానవ హారం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి లక్ష్మణ్‌రావు, డిఎల్ఓ రాష్ట్ర అధ్యక్షులు రంజిత్ కుమార్, టిడిపి నాయకులు తులసీరావు, బీఎస్పీ నాయకులు రాంబాబు, గాసన్న, గిరిజన సంఘం అధ్యక్షుడు రామారావు, మాజీ జీసీసీ చైర్మన్ శెట్టి లక్ష్మణుడు, వైసీపీ నాయకులు ఎంపీటీసీలు సత్తిబాబు,సాంబ, సర్పంచ్‌లు పాడి పోతురాజు, పూజారి సుబ్బారావు, డి వెంకటరావు, టీడీపీ అరుకు అసెంబ్లీ ఎస్‌టి సెల్ కార్యదర్శి కొర్రా సంతోష్ కుమార్, బిఎస్‌పి నాయకులు పూజారి రాంబాబు, జనసేన నాయకులు రాజు, సాయిబాబా, గిరిజనులు పాల్గొన్నారు.

తరలివచ్చిన నాయకులు, గిరిజనులు

మాతా శిశు మరణాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

▸▸ ప్రజాశక్తితో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమాల్ బాషా

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి ఏజెన్సీలో మాతా శిశు మరణాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సి.జమాల్ బాషా వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలను పటిష్టం చేసేందుకు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు ఇటీవల జిల్లాలోని చింతూరు, రంపచోడవరం ఐటిడిఏల పరిధిలో పీహెచ్సీలను ఆకస్మికంగా సందర్శించి డాక్టర్లు వైద్య సిబ్బంది పనితీరుపై పరిశీలించామని, లోటుపాట్లపై వెంటనే షోకాజ్ నోటీసులు కూడా జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటిడిఏల పరిధిలో 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయని, వీటిలో డాక్టర్లు, సిబ్బంది క్రమశిక్షణతో పనిచేసి మెరుగైన వైద్య సేవల కల్పన కోసం చేపడుతున్న కార్యక్రమాలపై ప్రజాశకి కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలిపిన వివరాలు ఆయన మాటల్లోనే....

మాతా శిశు మరణాలకు కారణాలు?

గర్భిణీలలో రక్తహీనత సమస్య ఎక్కువగా ఉంటుంది. దీన్ని గుర్తించి ఐరన్ మాత్రలు ప్రతి గర్భిణీ స్త్రీకి అందే విధంగా తగు చర్యలు తీసుకుంటున్నాం. గర్భిణీలకు ప్రతి నెల ఒకసారి డాక్టర్ పర్యవేక్షణలో ఆరోగ్య తనిఖీలు కచ్చితంగా చేపడున్నాం. పోషకాహారం కల్పనలో కూడా లోటు పాట్లు లేకుండా జిల్లా కలెక్టర్ ప్రత్యేక పర్యవేక్షణలో అంగన్వాడీల ద్వారా సక్రమంగా పోషకాహార పంపిణీ జరుగుతోంది. ప్రస్తుతం ఏజెన్సీలో చలికాలంలో శిశు మరణాలకు హైపో థెరమియా కారణమవుతోంది.

స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్లు

చలికాలంలో పిల్లలకు శక్తి హీనత ఎక్కువగా ఉంటుంది. న్యూమోనియా, జ్వరం వంటి లక్షణాలతో అనారోగ్య సమస్యలు ఉంటాయి. చనిపోయే ప్రమాద పరిస్థితులు ఉంటాయి. నెలల వయసులో ఉండే పిల్లల్ని వెచ్చగా ఉండే విధంగా పరుండ పెట్టాలి. జిల్లాలో పలుచోట్ల ప్రధాన ఆస్పత్రులలో స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయి. ఇలాంటి అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు పిల్లల్ని ఇక్కడకు రిఫర్ చేసి వైద్య సేవలు అందించేందుకు ఆశాలు, ఏఎన్ఎంల సహకారం పొందాలి.

వైద్యులు, సిబ్బంది వివరాలు?

ప్రతి పీహెచ్సీలో నిరంతరం ప్రజలకు వైద్య సేవలు అందించే విధంగా డాక్టర్లు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకు ంటున్నాం. ప్రతి పీహెచ్సీకి ఇద్దరు డాక్టర్లు, ముగ్గురు స్టాఫ్ నర్సులతో పాటు ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక ఫార్మసిస్ట్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, ఎఫ్ఎన్ఓతో కలిపి ప్రతి పీహెచ్సీలో 12 నుంచి 14 మంది వైద్య సిబ్బంది అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకున్నాం.

నూతన నియామకాలు

ఇటీవల రెండు నెలల క్రితం నుంచి జిల్లాలో కొత్తగా 60 మంది డాక్టర్లను, ముగ్గురు స్టాఫ్ నర్సులను నియమించాం. హెల్త్ సబ్ సెంటర్‌లను హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లుగా మార్పు చేసి ఇక్కడ కూడా ప్రతివారం డాక్టర్లతో ఓపి నిర్వహించే విధంగా చర్యలు తీసుకున్నాం. ఇక్కడ బీఎస్సీ నర్సింగ్ చేసిన 76 మందిని మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్‌గా నియమించాం. గ్రామాల్లో మంచాన పడి ఉండే దీర్ఘకాలిక రోగులకు కూడా వైద్యం కల్పనకు ఈ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లకు వచ్చే ఫ్యామిలీ డాక్టర్లు ప్రతి వారం వారిని పర్యవేక్షించి వైద్య సేవలు అందిస్తారు.

గిరిరక్షక స్కూటర్లు ఏర్పాటుకు ప్రతిపాదన

అల్లూరి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో రవాణా సేవలు అందుబాటులో లేని దృష్ట్యా మారుమూల గ్రామాల్లో గర్భిణీలకు, ఇతర రోగులకు, అత్యవసర వైద్య సేవల కల్పనకు ప్రభుత్వం గిరి రక్షక స్కూటర్లను ప్రతిపాదించింది. ఇవి త్వరలోనే అందుబాటులోకి వస్తే వీటి ద్వారా గర్భిణీలను కూడా ఆసుపత్రుల్లో కాన్పులకు తీసుకు రావడానికి సౌలభ్యం చేకూరే విధంగా వీటిని రూపొందిస్తున్నారు.

విద్యార్థులకు చర్మవ్యాధులు

ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న చర్మవ్యాధుల పరిస్థితిపై ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే చర్మవ్యాధులకు అవసరమైన మందుల్ని సరఫరా చేస్తున్నాం. పీహెచ్సీలు వారీగా పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్నాం.

సమస్యలపై సైనికుల్లా పోరాటం

పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి-విఆర్.పురం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలతో కుదేలైపోతోన్న దేశాన్ని, రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే ప్రతి సిపిఎం కార్యకర్త సైనికుడిలా పనిచేయాల్సి అవసరం ఉందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ కార్యకర్తల జిల్లాస్థాయి విస్తృత సమావేశంలో మాట్లాడుతూ, తీవ్రమైన అప్పుల ఊబిలో కూరుకుపోయి, రాష్ట్రం ఆర్థిక సంక్షోభం దిశగా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం నిర్వాసితుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పక్కనపెట్టేసి చోద్యం చూస్తోందన్నారు. గతేడాది సంభవించిన వరదల్లో బాధితులకు ఇంతవకు సాయం ఇవ్వకపోవడం దారుణమన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మతతత్వవాదులకు తగిన గుణపాఠం చెప్పాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో బిజెపి ఆటలు సాగబోనివ్వమన్నారు. ఎన్నికలకు మరో ఏడాది కాలం మాత్రమే ఉన్నందున కార్యకర్తలంతా సంఘటితంగా పనిచేసి, నియోజకవర్గంలో కమ్యూనిస్టుల జెండా ఎగిరేలా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. పోలవరం నిర్వాసితుల ఉసురు రాష్ట్ర ప్రభుత్వానికి తప్పకుండా తలుగుతుందని, వరద గోదావరిలో కొట్టుకుపోవడం ఖాయమని స్పష్టంచేశారు. సమావేశంలో రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, లోతా రామారావు, వాణిశ్రీ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, పులి సంతోష్‌కుమార్, పంకు సత్తిబాబు, యర్రంశెట్టి, సీసం శ్రీనివాసరావు, మర్లపాటి నాగేశ్వరరావు, మేకల నాగేశ్వరరావు, ఐవి వెంకటేశ్వర్లు, సాయం సీతారామయ్య, ఏడు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నేత సీతారాం

దీక్ష చేపడుతున్న ప్రజా సంఘాల నేతలు

పిఒ వైఖరిపై ఫిర్యాదు చేస్తాం

ప్రజాశక్తి-పాడేరు: గిరిజన ఉద్యోగ సంఘాల నాయకులు గిరిజన వ్యతిరేకి పాడేరు ఐటీడీఏ పీవో రోనంకి గోపాలకృష్ణకు కొమ్ము కాయడం తగదని, పిఒపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ముఖ్యమంత్రి, జాతీయ, రాష్ట్ర ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ కూడా రాధాకృష్ణ, కో కన్వీనర్ కే.ప్రభుదాస్ వెల్లడించారు. ఐటీడీఏ వద్ద చేపట్టిన రిలే దీక్షలు 35వ రోజుకు చేరిన సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ, పాడేరు ఐటిడిఏ పీవో గిరిజన ప్రజా ప్రతినిధులను హేళన చేస్తూ మాట్లాడుతున్నారని, తక్షణమే సరెండర్ చేసి గిరిజనుల మనోభావాలను పరిరక్షించాలన్నారు. పాడేరు ఐటిడిఏ జిల్లా హెడ్‌క్వార్టర్ లో సుమారు 6 మంది గిరిజన విద్యార్థులు ఇటీవల కాలంలో మృతి చెందితే కనీసం విద్యార్థుల కుటుంబాలను పీవో పరామర్శకు కూడా వెళ్ల లేదని విమర్శించారు. విద్యార్థుల మృతికి బాధ్యులను చేస్తూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వార్డెన్‌ను అక్రమంగా సస్పెండ్ చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు చిన్నారావు, బత్తిరి నరేష్, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

సంతలో వస్తువులు పరిశీలిస్తున్న గిరిజన సంఘం నాయకులు

నకిలీ సరుకులతో అనారోగ్యం

- గిరిజన సంఘం మండల కార్యదర్శి రామన్న

ప్రజాశక్తి-అరకులోయరూరల్: మండలంలోని సుంకరమెట్ట సంతలో నకిలీ వస్తువుల విక్రయాలు అరికట్టాలని గిరిజన సంఘం మండల కార్యదర్శి పి రామన్న డిమాండ్ చేశారు. ఆదివారం గిరిజన సంఘం ఆధ్వర్యాన సుంకరమెట్ట సంతలో సందర్శించి పలు దుకాణాల వద్ద వస్తువులను పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, వారపు సంతల్లో నిత్యావసర వస్తువులైన మంచి నూనె, పప్పు, చేపలు, దినుసులతో గిరిజనులు రోగాల పాలవుతున్నారన్నారు. సంతలో ఇంత మోసం జరుగుతున్నా అధికారులు పర్యటించి ఎందుకు అరికట్ట లేదని ప్రశ్నించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుంకరమెట్ట సంతలో రైతులను దళారులు తీవ్రంగా మోసం చేస్తున్నారని, వారు నిర్ణయించిన ధరకు అమ్మాల్సి వస్తుందన్నారు. దళారుల మోసాలపై సంబంధిత అధికారులు స్పందించి అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షులు జి.బుజ్జిబాబు, గిరిజన సంఘం మండల నాయకులు పి.నానిబాబు, కె.బుజ్జిబాబు, కృష్ణ అప్పన్న, బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మొక్కల ధ్వంసం

గంజాయి తోటలను ధ్వంసం చేస్తున్న ఒడిశా పోలీసులు

ప్రజాశక్తి -సీలేరు: ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ పోలీస్‌స్టేషన్ పరిధి పప్పులూరు పంచాయతీ గిల్లిగూడ గ్రామ అటవీ ప్రాంతంలో 35 ఎకరాల్లోని సుమారు 20వేల గంజాయి మొక్కలను ఆదివారం పోలీసుల ధ్వంసం చేశారు. వీటి విలువ సుమారు రూ.80లక్షలు ఉంటుందని భావిస్తున్నారు.

ఆపరేషన్ గంజాయిలో భాగంగా చిత్రకొండ ఎస్ఐ అనిల్ పోలిడా ఆధ్వర్యంలో ఎక్సైజ్,స్పెషల్ పార్టీ పోలీసులు గంజాయి తోటలపై విస్తృత దాడులు నిర్వహించారు. గిల్లిగూడ అటవీ ప్రాంతంలో గంజాయి తోటలను గుర్తించి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమని గిరిజనులకు అవగాహన కల్పించారు. గిరిజనులకు పదేపదే చెబుతున్నప్పటికీ తీరు మారకోవడం సరికాదని, గంజాయి సాగు, రవాణా ద్వారా కేసులు, జైళ్ల పాలై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. అయినప్పటికీ కొందరు గిరిజనులు తీరులో మార్పు రాకపోవడంతో ఆపరేషన్ గంజాయి చేపట్టి ధ్వంసం చేస్తున్నట్లు వెల్లడించారు. వచ్చేనెల 15వరకు ఆపరషన్ గంజాయి కొనసాగుతుందని, పోలీసులు పదేపదే హెచ్చరిస్తున్నప్పటికీ, గంజాయి మూలాలుండి, సాగుకు స్వస్తి చెప్పని గ్రామాలనే లక్ష్యంగా చేసుకుని ఈ ఆపరేషన్ కొనసాగుతుందన్నారు. దాడుల్లో పట్టుబడిన నిందితులపై కేసులు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికైనా గిరిజనులు నిషేధిత గంజాయి సాగుకు స్వస్తి పలకాలని, ప్రభుత్వం ఇస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.

బలిమెల జలాశయంలో మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి,- సీలేరు: ఆంధ్రా ఒడిశా సరిహద్దులోని బలిమెల జలాశయంలో చేపలు వేటకు వెళ్లి, గల్లంతైన మత్స్యకారుడు మృతదేహాన్ని అగ్నిమాపక సిబ్బంది వెలికితీసారు. మృతదేహాన్ని ఒరిస్సా పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసబ్యులకు అప్పగించారు. కడుములుగుమ్మ గ్రామానికి చెందిన పాంగి మంగ్లీ, అతని భార్య సోలే పాంగీలు ఇద్దరు కలిసి బోటులో వెళ్లి, జలాశయంలో చేపలు కోసం వల వేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి పాంగి మంగ్లీ నదిలో పడిపోయాడు. దీనిపై సోలే పాంగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

చిత్రకొండలోని అగ్నిమాపక సిబ్బంది బలిమెల జలాశయంలో గాలించి, మృతదేహాన్ని వెలికితీసారు. మృతుడు పాంగి మంగ్లి కుటుంబానికి ఆర్థికసహాయం అందించాలని గ్రామస్థులు కోరారు. దీనిపై తహాశీల్దార్ టి.పద్మ నవదొర సంప్రదించగా శవపరీక్ష నివేదిక వచ్చిన తరువాత ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. తరువాత ప్రభుత్వపరంగా పాంగి మంగ్లీ కుటుంబ సభ్యులకు ఆర్థికసహాయం అందిస్తామని తెలిపారు.

1/70 చట్టం తొలగింపు పిటిషన్‌పై

గిరిజన సంఘం రాస్తారోకో

ఆందోళన చేస్తున్న గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి కొయ్యూరు : గిరిజనులు పోరాడి సాధించుకన్న 1/70 చట్టాన్ని తొలగించాలని తెలంగాణ, భద్రాదిగూడెం జిల్లా గిరిజనేతరులు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేయడాన్ని నిరసిస్తూ, కొయ్యూరు మండల గిరిజన సంఘం నాయకులు మండల కేంద్రంలో ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సరుమూర్తి సూరిబాబు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని భూములు, అడవులు, అన్నింటిపైనా సర్వహక్కులు ఆదివాసీలవేనన్నారు. 1/70 చట్టాన్ని ఆదివాసులు పోరాటం ద్వారా సాధించుకున్నారన్నారు. ఐదో షెడ్యూల్లో గిరిజనేతరులకు హక్కులు ఉండవని, సమత జడ్జిమెంట్‌లో సుప్రీంకోర్టు తీర్పును మర్చిపోకూడదని గుర్తు చేశారు, ఆదివాసులు పోరాటాలకు తలొగ్గి భూ బదలాయింపు చట్టాన్ని చేశారన్నారు. ఇపుడు ఆ చట్టాన్ని తొలగించాలని పిటిషన్ దాఖలు చేయడమంటే, గిరిజనుల హక్కులు కాలరాయడమేనని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇప్పటికే అనంతగిరి చింతపల్లి, కొయ్యూరు మండలాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణాలు జరపాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిపాదనలు చేస్తున్నాయని, గిరిజన చట్టాలు, హక్కులను కాలరాసి, ఆదానీ, షిరిడీసాయి వంటికార్పోరేట్ కంపెనీలను మన్యంలోని సొత్తును దారాధత్తం చేసేందుకుజరుగుతున్న కుట్రలో భాగమే హైడ్రో పవర్ ప్రాజెక్టులు నిర్మాణమని, దీన్ని గిరిజన సంఘం తరుపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గిరిజనులు, వివిధ ప్రజాసంఘాలు ,మేధావుల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలను ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై అప్పలనాయుడు, గిరిజన సంఘం నాయకులు గూడెం లక్ష్మణరావు, టిడిపి ఎస్‌టి సెల్ నేత ఎంవివి ప్రసాదు, కొయ్యూరు సర్పంచ్ మాకాడ బాలరాజు, యువజన నాయకులు ఈరోజు బుజ్జిబాబు, కుమార్, గిరిజన సంఘం సభ్యులు, సానుభూతిపరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికునికి ఆర్థిక సాయం

సత్యనారాయణను పరామర్శిస్తున్న యూనియన్ నేతలు

ప్రజాశక్తి - రాజవొమ్మంగి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజవొమ్మంగి గ్రామానికి చెందిన వెచ్చాం సత్యనారాయణకు స్థానిక శ్రీ విఘ్నేశ్వర తాపీమేస్త్రిల సంఘం నాయకులు ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. చికిత్స అనంతరం ఆదివారం ఇంటికి తిరిగి వచ్చిన సత్యనారాయణను భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు పరామర్శించి, కొంత ఆర్థిక సాయం అందజేశారు. మరికొంత సాయం అందజేస్తామని భరోసానిచ్చారు.

ఈ సందర్భంగా యూనియన్ నేతలు అచ్చారావు, పి శ్రీను, ఎన్ రామకృష్ణ తదితరులు మాట్లాడుతూ, ఆపద, కష్టాల్లో ఉన్న కార్మికులను ఆదుకునేందుకు సంఘం ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఇప్పటికే చాలామందికి ఆర్థిక సాయం అందజేమన్నారు.ప్రమాదానికి గురై ఇబ్బందుల్లో ఉన్న తనకు అండగా నిలిచిన తోటి కార్మికులు, కార్మికసంఘం నేతలకు సత్యనారాయణ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. తాపీమేస్త్రీల యూనియన్ నాయకులు గొల్లపల్లి శ్రీను, సిగిరెడ్ల వీరబాబు, దేవర రమణ, దేవాడ సత్యనారాయణ, వి గంగాధర్ పాల్గొన్నారు.

బ్రొక్కోలికి డిమాండ్

వారపుసంతలో బ్రొక్కోలిని అమ్మకానికి తెచ్చిన గిరిజన మహిళా రైతు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరు వారపుసంతకు గిరిజనులు తెచ్చిన బ్రొక్కోలికి కొనుగోలుకు ఎపి జెన్‌కో కార్మికులు, ఇంజినీర్లుతోసహ పలువురు ఆసక్తి చూపడంతో వీటికి మంచి డిమాండ్ వచ్చించిన కాలీప్లవర్‌ను పోలి, ఆకుపచ్చ రంగులో ఉన్న బ్రొక్కోలిలో విటమిన్ సి, ఫైబర్, ప్రొటీన్లు, ఇతర పోషక విలువలు ఎక్కువగా ఉండడం సీజన్‌లో దొరికే ఈ కూరగాయలను కొనేందుకు వినియోగ దారులు ఎగబడ్డారు. కిలో రూ.80 ధర పలికినప్పటికీ, పలువురు కొనుగోలు చేశారు. హృద్రోగులకు ఇది మేలు చేస్తుందని పలువురు భావించడంతో దీన్ని కొనేందుకు ఆసక్తి కనబరిచారు. ఉత్తర భారతంలోనూ, ఇతర దేశాల్లో విరివిగాసాగులో ఉండే బ్రొక్కోలిని చింతపల్లికి తొమ్మిది కిలోమీటర్లు దూరంలో ఉన్న లోతుగెడ్డలో గిరిజనులు విరివిగా సాగు చేస్తూ విక్రయాలు జరుపుతుంటారు. ఈ క్రమంలోనే జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీలో కొర్ర బాబురావు 10 సెంట్లు భూమిలో బ్రొక్కోలి పంట సాగు చేశ్యాడు. పండిన పంటను సీలేరు వారపుసంతకు తీసుకొచ్చి విక్రయిస్తుండడంతో ఇక్కడ కూడా ఇది లభ్యమయ్యే పరిస్థితి వచ్చింది.

ఘాట్ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం

రోడ్డు మధ్యలో నిలిచిపోయిన భారీ లారీ

ప్రజాశక్తి -మారేడుమిల్లి : మారేడుమిల్లి, చింతూరు ఘాట్ రోడ్‌లో ఆదివారం వేకువజామున ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాజమండ్రి నుంచి ఒడిశా వైపు భారీ లోడుతో వెళు తున్న లారీ సాంకేతిక సమస్యతో ఇజ్జలురు జంక్షన్ సమీపంలో రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. వాహనాలు మళ్లిపోయేందుకు వీలులేనంతగా లారీ ఆగిపోవడంతో ఇరువైపులా వాహనాలు భారీ ఎత్తున నిలిచి, ట్రాఫిక్ జామ్ అయింది. దాదాపు ఆరుగంటల పాటు ప్రయాణికులు ఘాట్‌రోడ్డులో నానా ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. దీంతో ఆరుగంటల తర్వాత వాహనాలు కదిలాయి.

భూ కబ్జాపై నిరసన

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ భూకబ్జాల పర్వం ఒక్కొక్కటిగా బయట పడుతుండటంతో స్థానిక రెవిన్యూ అధికారులే నోరెళ్ల బెట్టాల్సిన పరిస్థితి నెలకొంది.గత పది రోజుల కిందట ఇదే మండలంలో తట్టబంద శివారు పొర్లు పాలెం గ్రామ శ్మశాన వాటిక కబ్జా చేయడంతో పాటు కొండ గెడ్డలు, వాగులు, గిరిజనుల భూములకు సాగు నీరు అందించే చెక్ డామ్ లు, డీ ఫారం భూములు కలిపి మరో 30 ఎకరాల భూములను రియల్ ఎస్టేట్ సంస్థ కబ్జాకు పాల్పిడిందన్న ఆరోపణలు మరువక ముందే మరో కబ్జా పర్వం వెలుగు చూసింది. మండలంలో బాధనపాడు రెవెన్యూ పరిధిలో ఈ మధ్యనే కొత్తగా వేసిన మరో వెంచర్ పక్కన ఒకే కుటుంబానికి చెందిన సుమారు ఎనిమిది ఎకరాల భూములను దర్జాగా కబ్జాకు పాల్పడటంతో తమకు న్యాయం చేయాలనీ కోరుతూ సంఘటనా స్థలంలోనే టెంట్ వేసి బాధిత కుటుంబం ఆదివారం నిరసన చేపట్టారు. బాధిత కుటుంబ సభ్యులు పిల్లా నూకరాజు, సర్వేశ్వరరావు తదితర కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా తాపే శ్వరంకు చెందిన తమ తండ్రి పిల్లా అచ్చారావు బాధన పాడు రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 40 (ప్రస్తుతం సర్వే నెం 54)లో సుమారు 24 ఎకరాలను తూర్పు గోదావరి జిల్లా మండపేట మండలం లింగరాజుపేటకు చెందిన దానబోయిన నాగరాజు నుంచి (10 ఎకరాలతో సహ)1967లో (డాక్ మెంట్ నెం 2527) కొనుగోలు చేసారని వివరించారు. పట్టా నెంబర్ 80గా 1996 లో నమోదు అయినప్పటి నుంచి తమ సాగులోనే ఉందన్నారు. పక్కనే రియల్ ఎస్టేట్ సంస్థకు తమ భూములలో సుమారు 14 ఎకరాలను తామే విక్రయం చేశామని..మరో రెండు ఎకరాలు భూమిని మరో రైతుకు విక్రయించామని బాధితులు చెప్పారు. మిగిలిన ఎనిమిది ఎకరాల భూమి తమ తండ్రి అచ్చారావు పేరునే ఉందని, అయితే ఆ భూమిని కూడా తామే కొనుగోలు చేస్తామని నమ్మించిన సంస్థ ప్రతినిధులు ఎగ్రిమెంట్ ప్రకారం అందులో సుగంధ చెట్లు నాటారని కాలం గడుస్తున్న భూములు కొనుగోలు వ్యవహారం తీర్చ కుండా కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కారించాలని స్థానిక తహసీల్దార్ దృష్టిలో పెట్టడం తో పాటు జిల్లా కలెక్టర్ స్పందనలో ఫిర్యాదు చేశామని బాధితులు చెప్పారు. పలుకుబడి ఉపయోగించి తమ భూమిని కబ్జా చేసారని తమకు ఇవ్వాల్సిన సొమ్ము చెల్లించకుండా తమ వద్ద ఉన్న భూమి రికార్డులు సరైనవి కావు అంటూ...భూములతో సంబంధం లేని రైతుల పేర్లు చూపించి కబ్జాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. భూముల వద్దకు వస్తే చంపేస్తా మంటూ బెదిరిస్తూన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే తమకు న్యాయం చేయాలనీ కోరుతూ తమ భూముల వద్దనే కుటుంబంతో సహా వంటా వార్పు తో నిరసన చేపట్టి నట్టు బాధితులు నూకరాజు, సర్వేశ్వ ర రావు కుటుంబం స్పష్టం చేశారు. తగిన భద్రత కల్పించాలని రావికమతం పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

ఈ సమస్య పై తహసీల్దార్ మహేశ్వరరావు ను వివరణ కోరగా...ఈ సివిల్ సమస్య పై ఇప్పటికే ఇరువ ర్గాలతో సమావేశం నిర్వహించామని, భూమి ఎలా ధఖలు పడిందో లింక్ డాక్ మెంట్ తీసుకు రావాలని ఇరు వర్గాలకు చెప్పామన్నారు. ఇంత వరకూ రాలేదని పేర్కొన్నారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని తహసీల్దార్ మహేశ్వరరావు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సందడి

ప్రజాశక్తి-నక్కపల్లి:స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 1976-77లో పాఠశాలలో చదువుకున్న పదో తరగతి బ్యాచ్ 45 సంవత్సరాల విరామం అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన నక్కపల్లి పాఠశాల వేదిక గా ఆదివారం కలుసుకున్నారు. ఉద్యోగ, వ్యాపార, రాజకీయాల్లో స్థిరపడిన వారంతా చాలాకాలం తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. చిన్ననాటి తీపి జ్ఞాపకాలను, చేదు అనుభవాలను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. చిన్ననాట చేసిన అల్లరి, ఆడిన ఆటలు, గురువులు బోధించే తీరు అన్నీ ఒకసారి నెమరు వేసుకుంటూ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ బ్యాచ్‌కు చెందిన వారిలో అత్యధిక మంది వివిధ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. వారంతా ఏ రంగాల్లో స్థిరపడ్డారు, పిల్లల చదువులు, ఉద్యోగాలు తదితర విషయాలను తెలియజేశారు. ఒకరికొకరు అండగా నిలవాలని, ప్రతి ఏడాది ఇలా కలవాలని నిర్ణయం తీసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. తమకు విద్య నేర్పిన ఎ.రంగస్వామి, కార్యాలయ సిబ్బంది కె.ప్రకాశరావులతో పాటు కార్యక్రమం నిర్వహించిన రాష్ట్ర ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, తెలుగు ఉపాధ్యాయులు ఎస్‌విఎస్ ఆచార్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డివి రామారావు, ఎన్.గోపాలరావు, నరసే వెంకటాద్రి, పోలసానపల్లి సూర్యప్రకాష్ రెడ్డి, రావు గోపాలకృష్ణ, మంచాల రమణ, అల్లు సత్యనారాయణ, శ్రీధరాల నాగేశ్వరరావు, పచ్చిపులుసు హనుమంతరావు, అబ్దుల్ అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: హైస్కూల్ 1987 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఆదివారం వారందరూ రాచపల్లి కామేశ్వర గుడి వద్ద కలిశారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ రవిబాబుకు గిరిజనుల వినతి

వినతిపత్రం ఇస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలోని కురిడి పంచాయతీ పరిధిలోని గడబగులుగు, జి.బలియగుడ, గొందిగుడ, పుట్టబంధ, పొడచంప ఐదు గ్రామాలకు సంబంధించి భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం విశాఖపట్నంలోని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు క్యాంపు కార్యాలయంలో ఆ గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. ఈ గ్రామాల ప్రజలు కలిసి మాట్లాడుతూ, తాము పోడు వ్యవసాయం చేసుకుంటూ, అదే కొండ నుండి తమ అవసరాలకు సరిపడిన కట్టెలను తెచ్చుకుంటూ సిల్వర్, కాఫీ, మిరియాలు తోటలను పెంచుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నామని రవిబాబు దృష్టికి తీసుకెళ్లారు. గత కొంత కాలం నుండి కురిడి పంచాయతీ సమీపంలో కంధం పంచాయతీకి చెందిన జంకొరగుడ గ్రామస్తులు తమ కొండకు కట్టెల పేరుతో వచ్చి చెట్లను నరికి తమ కాఫీ, మిరియాలు, సిల్వర్ తోటలను పాడుచేస్తున్నారని తెలిపారు. తమ కొండకు రావద్దని చెప్పినా సరే వినకుండా గొడవలు చేయడంతో పాటు తమ ఐదు గ్రామాల ప్రజలపై పోలీస్ స్టేషన్లో కేసులు పెట్టి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు.దీంతో స్పందించిన చైర్మన్ రవిబాబు పోలీసులతో ఉన్న కురిడి పంచాయతీ పరిధిలోని గడబగులుగు కొండపైనున్న పోడు భూముల సమస్యకు సంబంధించి కురిడి పంచాయతీ పరిధిలోని ఐదు గ్రామాలు, కంధం పంచాయతీ జంకొరగుడ గ్రామాలకు సంబంధించిన భూ సమస్యను సజావుగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, ఎవరి సరిహద్దుల్లో వారు సాగును కొనసాగించాలని ఎటువంటి తగాదాలు తలెత్తకుండా సజావుగా సమస్యను పరిష్కరించే తీసుకోవాలని సబ్ కలెక్టర్, డీఎఫ్ఓ, సీఐకు ఫోన్ ద్వారా ఆదేశించినట్లు ఆ గ్రామస్తులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కురిడి సర్పంచ్ బోయిన లచ్చు, వైసిపి సీనియర్ నాయకులు ప్రకాష్ , వార్డు సభ్యులు ప్రసాద్, రఘురాం, తుమ్ నాథ్, అప్పలరాజు, కురిడి పంచాయతీ పరిధిలోని ఐదు గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

కాఫీ ప్రాజెక్టుపై శ్వేత పత్రం విడుదల చేయాలి

ఎపి గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి-పాడేరు: కాఫీ ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు, ఆదివారం జీకే వీధి మండలం రింతాడ పంచాయతీ ముల్లు మెట్ట గ్రామంలో గిరిజన సంఘం జికెవిది మండల నాయకులు జి సత్యనారాయణ, అంపురంగి బుజ్జిబాబులు కాఫీ రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, 2014 అక్టోబర్ 17న ఆనాటి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాడేరు పర్యటన సందర్భంగా హుదూద్ తుఫాన్లో నష్టపోయిన 45 వేల ఎకరాల కాఫీ తోటలను పునరుద్ధరణ, మరో లక్ష ఎకరాల కాఫీ పునరుద్ధరణకు కాఫీ ప్రాజెక్టును ప్రకటించారని తెలిపారు. లక్ష ఎకరాలు సాగు విస్తరణ కోసం రూ.354.940 కోట్లు, కాఫీ పునరుద్ధరణకు రూ.65.880 కోట్లు, పల్పర్ మిషన్ కొనుగోలు నిమిత్తం రూ.17.927 కోట్లు, ప్రాజెక్టు మేనేజ్మెంట్‌కు రూ.28.220 కోట్లు, మార్కెట్ సదుపాయంకు జిసిసి ద్వారా రూ.56 కోట్లకు నిధులు కేటాయించారని, ఈ నిధులు వ్యయంపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాఫీ ప్రాజెక్టు లక్ష్యాన్ని ఏనాడు సమీక్షించ పోవడంతో కేటాయించిన నిధుల్లో అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు, అంతర్జాతీయ మార్కెట్ సదుపాయం కల్పిస్తామని మాక్స్ సొసైటీని ఏర్పాటు చేసి ఐటీడీఏ పీవో కనుసైగల్లో మాజీ కాఫీ ఐటిడిఏ అధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.మాక్స్ సొసైటీ కన్నా జిసిసి రైతులకు అధిక కొనుగోలు ధర అందిస్తుందన్నారు.వాస్తవానికి అంతర్జాతీయ మార్కెట్తో పోల్చుకున్నప్పుడు జిసిసి చెల్లించే ధర చాలా తక్కువగా ఉందన్నారు, ప్రైవేట్ సంస్థలకు లాభాలు చేకూర్చే విధంగా ఉన్న ఐటీడీఏ పీవో చర్యలపై జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించాలని కోరారు.ట్రైబల్ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించి మార్కెట్ సదుపాయం, గిట్టుబాటు ధర కల్పిస్తామని కోట్లాది రూపాయలను పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. ఐటీడీఏ చర్యలతో ప్రభుత్వ సంస్థ జిసిసి నిర్వీర్యం అవడమే కాకుండా నష్టపోతుందన్నారు. ఇప్పటివరకు కాఫీ ప్రాజెక్టు నిర్వహణ ఖర్చు, కాఫీ సాగు విస్తరణ, మార్కెట్ సదుపాయం తదితర వాటిపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని రైతుల తరపున డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు గడతూరి సత్యనారాయణ, అంపురంగి బుజ్జిబాబు, మాతే నాగేశ్వరరావు చిన్నారావు బి జీవరత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'సిఎం మెప్పు కోసం ఎమ్మెల్యే ఆరాటం'

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:సీఎం జగన్మోహన్‌రెడ్డి మెప్పు పొందేందుకు ఎమ్మెల్యే గణేష్ ఆరాట పడుతున్నారని నర్సీపట్నం టీడీపీ నాయకులు నేతల నాగేశ్వరరావు ఆరోపించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడను పదే పదే విమర్శిస్తే రానున్న ఎన్నికల్లో మళ్లీ ఎమ్మెల్యే టిక్కెట్ వస్తుందని పగటి కలలు కంటున్నారన్నారు. సీఎం జగన్ దగ్గర మార్కులు కొట్టేందుకే ఎమ్మెల్యే అయ్యన్నను ఇష్ట మొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. అయ్యన్నపాత్రుడుపై ఎన్ని కేసులు పెట్టుకున్నా బెదరకుండా తన గళాన్ని వినిపిస్తున్నారని చెప్పారు. ఇకనైనా అయ్యన్నపై విమర్శలు మాని నియోజకవర్గ సమస్యలపై దృష్టి సారించాలని హితవు పలికారు.

మాకవరపాలెం:వచ్చే ఎన్నికల్లో సీటు రాదని తెలిసి నర్సీపట్నం ఎమ్మెల్యే సైకోలా ప్రవర్తిస్తున్నారని టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రాపాత్రుడు విమర్శించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, ప్రతిరోజు ఉదయం లేవగానే అయ్యన్నపాత్రుని తలచు కోకుంటే ఎమ్మెల్యేకు నిద్ర పట్టదని ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడుని తిట్టడం తప్ప గ్రామాలను అభివృద్ధి చేసిందేమీ లేదని విమర్శించారు.వైద్య కళాశాల నిర్మాణానికి వైసీపీ నాయకులు భూమిని ఇవ్వకపోతే టిడిపి నాయకులు ముందుకు వచ్చి ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అల్లు రామనాయుడు, మాజీ జెడ్పిటిసి శేషు కుమార్, మాజీ వైస్ ఎంపీపీ గోవింద,. సర్పంచ్ వెంకటరమణ పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-నక్కపల్లి: నక్కపల్లి జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రమాదం కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.విశాఖపట్నం నుండి విజయవాడ వెళ్తున్న కారు నక్కపల్లి వద్దకు వచ్చేసరికి బైక్ అడ్డంగా రావడంతో డ్రైవర్ అప్రమత్తమై కారును స్లో చేశాడు. దీంతో అదే మార్గంలో వెనుక నుండి వస్తున్న మరో కారు ఆగి ఉన్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతింది. కారులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

గోతిలో పడి వృద్ధురాలికి గాయాలు

ప్రజాశక్తి -కొత్తకోట:మేజర్ పంచాయతీ కొత్తకోటలో తాగునీటి కుళాయి కోసం తవ్విన కాలువలు ప్రమాద కరంగా మారాయి. ఆదివారం గాంధీ నగర్ వీధిలో కోర్ని రాజు ఇంటికి సమీపంలో తవ్వి వదిలిన కాలువ గొయ్యిలో గ్రామానికి చెందిన వృద్ధురాలు ప్రమాదవ శాత్తు పడిపోవడంతో కాలు విరిగి తీవ్రంగా గాయపడింది. స్థానికులు వృద్ధురాలిని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఇదిలా ఉండగా కుళాయి పైపులు ఏర్పాటుకు తవ్విన కాలువ గోతులు ఎప్పటికప్పుడు పూడ్చకుండా వదిలేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ఆలయ నిర్మాణానికి పైలా విరాళం

ప్రజాశక్తి- చీడికాడ: మండలంలోని చినగోగాడలో అభయాంజనేయ స్వామి నూతన ఆలయ నిర్మాణానికి మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు పైలా ప్రసాదరావు రూ.50 వేల విరాళం ప్రకటించారు. విరాళం ప్రకటించిన పైలాకు గ్రామ పెద్దలు, ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ కమిటీ సభ్యులు అద్దేపల్లి చిన్న అప్పారావు, బలిజి కుమార్, ఏ.రామారావు, పడాల అప్పలనాయుడు, పడాల కన్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నగదు, సరుకుల వితరణ

ప్రజాశక్తి - ఎస్.రాయవరం: తిమ్మాపురం గ్రామానికి చెందిన జనసేన నాయకుడు సేనాపతి బాబూరావు మాష్టారు నేతృత్వంలో జనసైనికులు పెదగుమ్ములూరు గ్రామానికి చెందిన పోలవరపు లోవరాజు కుటుంబానికి అండగా నిలిచారు. లోవరాజుకు కొన్ని రోజులుగా కాళ్ళు చచ్చు బడిపోయాయి. దీంతో కుటుంబాన్ని పోషించే దారి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జనసైనికులు పది వేల నగదు, సరుకులను అందించారు.

పవన్‌పై ఎమ్మెల్యే వ్యాఖ్యలు తగవు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు వ్యాఖ్యలను జనసైనికులు ఖండించారు. ఆదివారం సాయంత్రం అడ్డురోడ్డులో జనసైనికులు మీడియా సమావేశం నిర్వహించారు. తిమ్మాపురం జనసైనికుడు గుర్రం ధన మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ రాజకీయాలకు అనర్హుడంటూ వ్యాఖ్యానించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పదవికి పదహారు నెలలు జైలు శిక్ష అనుభవించిన వ్యక్తి అర్హుడా అంటూ ఎద్దేవా చేశారు. వైసిపిలో పాపులర్ కావాలనుకునే ప్రతి ఒక్కరూ పవన్ కళ్యాణ్ పై వ్యాఖ్యలు చేయడం పరిపాటిగా మారిందన్నారు. ఎమ్మెల్యేకు టిక్కెట్టు ఇచ్చే పరిస్థితి లేక పోవడంతో పవన్ పై వ్యాఖ్యలు చేయడంతో అధిష్టానం మెప్పు పొందాలను కోవడం శోచనీయమన్నారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్తీక్. బత్తుల రామకృష్ణ, బోయిన రాజు, పాలపర్తి రవికుమార్, వంగలపూడి చంద్రశేఖర్, బల్లంకి రాజు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి -రావికమతం: ప్రకృతి వ్యవసాయంపై డ్వాక్రా మహిళలు, రైతాంగం అవగాహన పెంచుకోవాలని పిఆర్‌పి నిర్మల సూచించారు. మండలంలో గర్నికం గ్రామంలో ఆదివారం డ్వాక్రా సంఘాలు, రైతులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రసాయనక ఎరువులు వాడకంతో అనేక రోగాలకు ప్రజలు గురవుతున్నారని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంతో పండిన పంటలను తినడంతో అనారోగ్యం బారిన పడమన్నారు.రైతులు రసాయనిక ఎరువులను మానుకొని ఇకనుంచి ప్రకృతి వ్యవసాయం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివోఏ లక్ష్మి పాల్గొన్నారు.

వారపు సంతలో తనిఖీలు చేపడుతున్న పోలీసులు

వారపుసంతలో విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి - సీలేరు: జీకే వీధి మండలం దారకొండ వారపుసంతలో ఆదివారం 42వ బెటాలియన్ సిఆర్‌పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్, స్థానిక ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. వారపుసంతకు వచ్చిపోయే మార్గంలో వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులపై ప్రత్యేకనిఘా పెట్టి సోదాలు నిర్వహించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గిరిజన యువతతో మమేకమై పలు విషయాలపై చర్చించారు. యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. క్రీడలు, చదువుపై దృష్టిపెట్టి, భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని, దీనికి ప్రభుత్వపరంగా అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పోలీసుశాఖాపరంగా అండగా ఉంటామని భరోసానిచ్చారు.ఈ సందర్భంగా గ్రామాల్లో సమస్యలపై ఆరా తీశారు. గంజాయి, నాటుసారా వంటి అసాంఘిక కార్యాకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. తనిఖీల్లో సిఆర్‌పిఎఫ్, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

వెంకటాద్రి మృతికి సంతాపం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : భారత హేతువాద సంఘం అధ్యక్షుడు రావిపూడి వెంకటాద్రి మృతికి భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి, జిల్లా అధ్యక్షులు వై.నూకరాజు ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. వెంకటాద్రి ప్రముఖ రచయిత, హేతువాది త్రిపురనేని రామస్వామి శిష్యుడని తెలిపారు. ఆయన బహుగ్రంథ రచయితని పేర్కొన్నారు. 1999లో విశాఖలో జరిగిన భారత నాస్తిక సమాజం హేతువాద సభలో పాల్గొన్నారని గుర్తు చేశారు. 1982 నుంచి హేతువాది మాసపత్రిక సంపాదకులుగా ఉన్నారన్నారు. పెరియార్ రామస్వామి, అన్నాదురైలతో పలు సభలు నిర్వహించారని తెలిపారు.

లోకేష్ పాదయాత్రకు అడ్డంకులెందుకు ?

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకత, టిడిపికి లభిస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక అక్కసుతో లోకేష్ పాదయాత్ర ప్రారంభం కాకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి నజీర్ విమర్శించారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తమ పార్టీ యువనేత లోకేష్ పాదయాత్రను అడ్డుకోవడానికి సాధ్యంకాని షరతులు, నిబంధనలు విధిస్తున్నారని మండిపడ్డారు. పాదయాత్ర కోసం డిజిపి కోరిన వివరాలు హాస్యాస్పదంగా ఉన్నాయని పేర్కొన్నారు. గతంలో పాదయాత్రలు చేసిన వారికెవరికైనా, ఏ ప్రభుత్వాలైనా ఇన్ని నిబంధనలు, షరతులు విధించాయా ? అని ప్రశ్నించారు. నాటి టిడిపి ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి పాదయాత్రకు ఎటువంటి అడ్డంకులూ సృష్టించకుండా భద్రత కల్పించిన విషయాన్ని గుర్తుంచుకోవాలని తెలిపారు. పోలీసుల అనుమతి లభించినా, లభించకపోయినా లోకేష్ పాదయాత్ర జరిగి తీరుతుందని అన్నారు.

మహా శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నగరంలోని పూర్ణా మార్కెట్ వద్ద ప్రసిద్ధి చెందిన శ్రీ దుర్గాలమ్మ ఆలయంలో ఈ ఏడాది మహా శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆదివారం ఆలయంలో జరిగిన ఆలయ పాలకవర్గ సమావేశం నిర్ణయించింది. 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మహా శివరాత్రి ఉత్సవాలు ఫిబ్రవరి 19న జరుగుతాయన్నారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే ఈ ఉత్సవంలో అన్ని రకాల సౌకర్యాలూ కల్పించాలన్నారు. ఘటాల ఉత్సవం, ఊరేగింపు, శారీ ఉత్సవాలు జరుగుతాయన్నారు. శివరాత్రి రోజున ప్రత్యేక దర్శనం ధర రూ.50, సాధారణ దర్శనం ధర రూ.20గా నిర్ణయించినట్లు తెలిపారు. భక్తులకు ఉచితంగా మంచినీరు, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలన్నారు.

త్రాసు.. తిరకాసు

విశాఖ నగరంలో పెరుగుతున్న తూకం మోసాలు - అంతంతమాత్రంగానే అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖ) : విశాఖ నగరం.. 'తూకం' తప్పుతోంది. రోజురోజుకూ మోసాలు పెరుగుతున్నాయి. నగర వ్యాప్తంగా పండ్ల నుంచి కూరగాయల వరకు.. చికెన్, నిత్యావసరాలు, పెట్రోలు, డీజిల్, ఇలా ప్రతి వస్తువు విక్రయంలోనూ వినియోగదారుల కళ్లకు వ్యాపారులు గంతలు కడుతున్నారు. ఒకవైపు తూకాల్లో మోసాలు, మరోవైపు కల్తీతో వినియోగదారులు నష్టపోతున్నారు. కొందరు వ్యాపారులు కనీస ప్రమాణాలు పాటించడం లేదు. ఒక కిలోకు 150 నుంచి 200 గ్రాముల వరకూ తగ్గించి అమ్ముతున్నారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా అన్ని వ్యాపార కార్యకలాపాల్లో జరుగుతున్న త్రాసు తిరకాసుతో సాధారణ ప్రజలు ధగా పడుతున్నారు. మార్కెట్‌లోని ఎలక్ట్రానిక్ కాటాల (డిజిటల్ వేయింగ్ మిషన్లు)ను సైతం ఆధునిక సాంకేతికతతో ట్యాంపరింగ్ చేస్తుండటంతో, కళ్లకు తూకం బాగా కనిపిస్తున్నా.. వాస్తవంగా తగ్గుతోంది. డిజిటల్ వేయింగ్ మిషన్లలో కిలోకు 100 గ్రాముల వరకు దందా చేస్తున్నారు. దుకాణంలో ఒక వస్తువు కొనుగోలు చేసి, ఇంటికి వెళ్లి చూశాక పరిశీలిస్తే, తక్కువ తూకం ఉన్నట్లు వినియోగదారులు వాపోతున్నారు. అంతేకాదు ప్యాకింగ్‌పై ఎక్కడా తయారీ తేదీ లేకుండానే విక్రయాలు జరుగుతున్నాయి. ఇంత జరుగుతున్నా, తూనికలు, కొలతల శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు వినిపిన్నాయి. పత్రికల్లో వార్తా కథనాలు వచ్చిన కొన్ని రోజులు తూతూ మంత్రంగా తనిఖీలు చేసి, ఆ తర్వాత చేతులు దులుపుకుంటున్నారు. వ్యాపారుల నుంచి మామూళ్లు తీసుకోవడం వల్లే అధికారులు సరిగా స్పందించడం లేదని జనం నుంచి విమర్శలు వస్తున్నాయి.

తనిఖీలకు సిబ్బంది కొరత

నగరంలో పెరిగిన దుకాణాలు, జనాభాకు తగ్గట్టు తూనికలు, కొలతల శాఖ సిబ్బంది నియామకం జరగడం లేదు. సిబ్బంది కొరతతో తనిఖీలు మొక్కుబడిగా జరుగుతున్నాయి. డివిజన్‌కు ఒక్కరు చొప్పునే ఉండటంతో వారి పరిధిలోని ఈ మోసాలను అరికట్టడం తలకు మించిన భారంగా మారుతోంది. దీన్ని ఆసరా చేసుకున్న వ్యాపారులు కొలతల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు తనిఖీకి వచ్చినట్లు సమాచారం అందగానే మిగిలిన వ్యాపారులు దుకాణాలు మూసేస్తున్నారు. రెండు నెలల కిందట ఇదే విధంగా నగరంలోని పూర్ణా మార్కెట్ ప్రాంతంలో అధికారులు తనిఖీలకు వచ్చి ఓ దుకాణంలోకి వెళ్లగా సమాచారం అందుకున్న మిగతా వ్యాపారులు దుకాణాలు మూసేసి పత్తాలేకుండా వెళ్లడమే నిదర్శనం. చికెన్ ధరలు కూడా ఆయా ప్రాంతాల్లో వేర్వేరుగా ఉంటున్నాయి. కిలోకు రూ.10 నుంచి రూ.20 వరకు కొన్నిచోట్ల తక్కువ ధరకు అమ్ముతున్నారు. అదేమని అంటే పేపర్ ధర అని అంటున్నారు. నిజానికి అటువంటిచోట్ల చికెన్ అమ్మకంలో కిలోకు వంద గ్రాముల వరకు తక్కువ ఉంటోంది. చేపలు, కూరగాయల అమ్మకాల్లో ఎలక్ట్రానిక్ కాటాలను వినియోగించడం లేదు. ప్రధానంగా రోడ్లపైన, తోపుడుబండ్లపైన జరిగే అమ్మకాల్లో ఇది కనిపిస్తోంది. రైతు బజార్లలో మాత్రం ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాలను వినియోగిస్తున్నారు. అక్కడ కూడా తూకంలో తేడా ఉంటోంది. అయితే సీతమ్మధార రైతు బజారులో మాత్రం వినియోగదారులు కొనుగోలు చేసిన కూరగాయలను అక్కడ మార్కెటింగ్ శాఖ ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ తూనిక యంత్రంలో తూకం వేసుకొని, సరిచూసుకొనే అవకాశం ఉంది. తేడా వస్తే రైతు బజార్ ఎస్టేట్ అధికారికి ఫిర్యాదు చేయవచ్చు. మిగిలిన రైతు బజార్లలో ఇటువంటి సదుపాయం లేదు.

ఎండియు వాహనాల్లో..

పౌర సరఫరాల శాఖ ద్వారా బియ్యం, కందిపప్పు, చక్కెర వంటి నిత్యావసర వస్తువులను రేషన్ కార్డుదారులకు ఇస్తున్నారు. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక డోర్ డెలివరీ పేరుతో ఎండియు వాహనాలను తెచ్చి, అందులోనే తూకం కాటాలను ఫిక్స్ చేసి సరఫరా చేస్తున్నారు. కానీ ఈ ఎండియు వాహనంలోనూ తూకంలో తేడాలు వస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. డీలర్లు సొంతంగా ఏర్పాటు చేసుకున్న ఎలక్ట్రానిక్ కాటాలనే ఇటువంటి వాహనాలలో వినియోగిస్తున్నారు. ఈ కాటాల ద్వారా 10 కిలోల బియ్యం తీసుకుని బయట తూకం వేస్తే 9 కిలోలే ఉంటున్నాయి. ఎవరైనా రేషన్ కార్డుదారులు తూకంపై ప్రశ్నిస్తే తమకు బస్తాల్లోనే తూకం తక్కువగా వస్తోందని, తాము ఎవరికి చెప్పుకోవాలంటూ ఎదురు ప్రశ్న వేస్తున్నారు. గ్యాస్ ఏజెన్సీ, పెట్రోలు బంకుల్లో వంట గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసే వాహనంలోనూ ఎలక్ట్రికల్ కాటాలు ఉండాలి. వినియోగదారులు కోరితే తూకం వేసి చూపించాలి. కానీ ఎక్కడా అలా జరగడంలేదు. వాస్తవంగా సిలిండర్లను తూకం వేస్తే ఒక్కో దానిలో 2 నుంచి 3 కేజీల తక్కువగా ఉంటున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. ఇక పెట్రోలు బంకుల్లోనూ వ్యాపారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. లీటరుకు 100 నుంచి 200 మిల్లీలీటర్ల వరకూ తక్కువ ఉంటోంది. ఇంత జరుగుతున్నా వినియోగదారుల్లో చైతన్యం తీసుకువచ్చే కార్యక్రమాలను తూనికలు, కొలతల శాఖ చేపట్టిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా ఆ శాఖ అధికారులు స్పందించి ఎలక్ట్రికల్ కాటాల ట్యాంపరింగ్, కల్తీల నివారణకు విస్తృత తనిఖీలు చేపట్టాలని, తూకాలపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

మీనాక్షికి పిఎం రాష్ట్రీయ బాల పురస్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నానికి చెందిన చెస్ క్రీడాకారిణి అలనా మీనాక్షికి ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారం దక్కింది. ఈ నెల 23వ తేదీన జరిగే కార్యక్రమంలో ఆమెకు భారత రాష్ట్రపతి ఈ అవార్డును అందజేస్తారు. 24న పిఎం మోడీ అవార్డు గ్రహీతలతో సంభాషిస్తారు. బాల పురస్కారానికి లక్ష రూపాయలు, పతకం, సర్టిఫికెట్, బహుమతి ప్రదానం చేయనున్నారు. ఈ పురస్కారాన్ని దక్కించుకున్న మీనాక్షికి ఆంధ్రా చెస్ అసోసియేషన్ సభ్యులు కెవివి.శర్మ, భీమారావు, జ్వాలాముఖి, శ్రీకాంత్, మణికంఠ తదితరులు అభినందించారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్ట్

ప్రజాశక్తి - సీలేరు: గంజాయి అక్రమ రవాణా కేసులో పరారీలో ఉన్న పాత నేరస్తుడుని అదుపులో తీసుకుని ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక ఎస్ఐ రామకృష్ణ వెల్లడించారు. జీకేవీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ చల్లనిశిల్ప గ్రామానికి చెందిన జగబందు, గతనెలలో పట్టుబడిన గంజాయి అక్రమ రవాణా కేసులోని ఐదుగురు నిందితులు పట్టుబడినప్పటికీ, అప్పట్లో జగబంధు పరారయ్యాడు. దీనిపై ప్రత్యేకనిఘా పెట్టిన పోలీసులకు నిందితుడు జగబంధు స్వగ్రామమైన చల్లని శిల్పలోఉన్నట్లు సమాచారంఅందుకున్న పోలీసులు, ఆదివారం దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

సికింద్రాబాద్ - అగర్తల మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని సికింద్రాబాద్ - అగర్తల - సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైళ్లు నడపాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. 07030 సికింద్రాబాద్ - అగర్తల ప్రత్యేక రైలు ఫిబ్రవరి 6 నుంచి 27 వరకు ప్రతి సోమవారం సాయంత్రం 16.35 గంటలకు బయలుదేరి మంగళవారం ఉదయం 04.20 గంటలకు విశాఖపట్నం చేరుకుని మరలా 04.40 గంటలకు బయలుదేరి గురువారం 03.00 గంటలకు అగర్తల చేరుకుంటుంది. 07029 అగర్తల - సికింద్రాబాద్ ప్రత్యేక రైలు ఫిబ్రవరి 10 నుండి మార్చి 3 వరకు ప్రతి శుక్రవారం ఉదయం 06.10 గంటలకు అగర్తలలో బయలుదేరి ఆదివారం తెల్లవారుజామున 03.05 గంటలకు విశాఖపట్నం చేరుకుని 03.15 గంటలకు బయలుదేరి ఆదివారం సాయంత్రం 04.15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైళ్లు గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, దువ్వాడ, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, బెర్హంపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్, బాలాసోర్, ఖరగ్‌పూర్, దంకుని, రాంపూర్ హాట్, మాల్దా టౌన్, కిషన్‌గంజ్, న్యూజల్ అలీపుర్‌దువార్, న్యూ బొంగైగావ్, కామాఖ్య, గౌహతి, న్యూ హాఫ్లాంగ్, బదర్‌పూర్, న్యూ కరీంగంజ్, ధర్మనగర్, అంబాసా స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తాయని అధికారులు తెలిపారు.

స్వచ్ఛతా ర్యాలీలో పాల్గొన్న ఎస్‌బిఐ అధికారులు

స్వచ్ఛతపై అవగాహన ర్యాలీలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పరిసరాల పరిశుభ్రత పాటించడం అందరి బాధ్యతని భారతీయ స్టేట్ బ్యాంకు అధికారులు తెలిపారు. ఎస్‌బిఐ పరిపాలనా కార్యాలయ డిప్యూటీ జనరల్ మేనేజర్ మన్మయ పాండబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్‌కె.బీచ్‌లో 'స్వచ్ఛత పఖ్వాడా' కార్యక్రమాన్ని నిర్వహించారు. బీచ్ పొడవునా సాగిన ఈ ర్యాలీలో పర్యావరణ పరిరక్షణ నినాదాలు చేశారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. విరివిగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. గతంలో తమ విశాఖ మాడ్యుల్ పరిధిలో ఉన్న మూడు ఉత్తరాంధ్ర జిల్లాల్లో సుమారు 25 వేల మొక్కలు నాటామని గుర్తు చేశారు. విశాఖ నగరం అత్యంత సుందరమైందని, ఈ నగరాన్ని అద్దం వలే కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్యాంక్ రీజనల్ అధికారులు, పిఆర్ఓ రామమూర్తి నాయుడు, నగర పరిధిలోని బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : దేశంలో రెండో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకైన బ్యాంకు ఆఫ్ బరోడా విశాఖపట్నం రీజియన్ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులో స్వచ్ఛతపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. జివిఎంసి కమిషనర్ రాజాబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విశాఖను పర్యావరణ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. బ్యాంక్ రీజనల్ మేనేజర్ వైవిఎస్.కోటేశ్వరరావు మాట్లాడుతూ స్వచ్ఛ భారత్‌లో భాగంగా బ్యాంకు ఆధ్వర్యాన ఈ నెల 16 నుంచి 31వ తేదీ వరకు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనిలో భాగంగా ఆర్‌కె.బీచ్ పరిసరాలలో శుభ్రతా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ర్యాలీ సందర్భంగా నార, కాటన్ సంచులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిఆర్ఎం రవీంద్ర, చీఫ్ మేనేజర్లు, బ్రాంచి మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.